

సాక్షి
పల్నాడు
ఆదివారం । 7 । సెప్టెంబర్ । 2025



పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి 8,430 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది.



పులిచింతల సమాచారం

అచ్చంపేట : పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 35,450 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 34,397 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుతం 43.4506 టీఎంసీల నిల్వ ఉంది.



సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 589.60 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 81,831 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

న్యూస్‌రీల్

చంద్రగ్రహణం కారణంగా అమరేశ్వరాలయం మూసివేత



అమరావతి: ప్రసిద్ధ శైవ క్షేత్రం అమరావతిలోని అమరేశ్వరాలయాన్ని చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి మూసివేస్తున్నట్లు ఈవో రేఖ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం ఆలయ సంప్రోక్షణ అనంతరం 8 గంటల నుంచి స్వామివారి దర్శనాన్ని యథావిధిగా కల్పిస్తామని తెలిపారు.

నీలకంఠుడికి జలాభిషేకం




దాచేపల్లి : నీలకంఠేశ్వర స్వామిని తాకుతూ కృష్ణానది ప్రవహిస్తోంది. దాచేపల్లి మండలం కాట్రపాడు సమీపంలో కృష్ణా నది ఒడ్డున నీలకంఠేశ్వర స్వామి విగ్రహాన్ని గత కృష్ణా పుష్కరాల సందర్భంగా డాక్టర్ కనుమూరి క్రాంతి కుమార్, డాక్టర్ విక్రాంత్ కుటుంబ సభ్యులు ప్రతిష్టించారు. శనివారం నదిలో వరద పెరిగి నీలకంఠేశ్వర విగ్రహాన్ని తాకుతూ నీరు ప్రవహిస్తోంది. సాగర్ క్రస్ట్ గేట్ల నుంచి నీటిని విడుదల చేస్తే ఈ విగ్రహం పైనుంచి నీరు ప్రవహిస్తుంటాయి.

వైభవంగా నవ వినాయకుల నిమజ్జనం



అమరావతి: గుంటూరు, పల్నాడు జిల్లాల సత్యసాయి సేవా సమితుల ఆధ్వర్యంలో వినాయక చవితిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన తొమ్మిది వినాయక విగ్రహాలను శనివారం ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన అమరావతిలో వైభవంగా నిమజ్జనం చేశారు. గత తొమ్మిది రోజులుగా గణపతి నవరాత్రోత్సవాలను తొమ్మిది చోట్ల నిర్వహించుకుని అమరావతి వద్ద కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. ఇలా ప్రతి ఏటా నిర్వహిస్తామని అమరావతి సత్యసాయి సేవా సమితి కో–ఆర్డినేటర్ సీహెచ్ జాజిబాబు తెలిపారు. గుంటూరు జిల్లాలో జిల్లా పరిషత్ ప్రాంగణంలోని సత్యసాయి శాంతిసుధ , గుంటూరు బైపాస్ రోడ్డులోని ఆధ్యాత్మిక సామ్రాజ్యం నుంచి దుగ్గిరాల, తెనాలి, మోదుకూరు, పల్నాడు జిల్లాలో చిలకలూరిపేట, అచ్చంపేట, అమరావతి సాయిబాబా మందిరంలో, త్రిశక్తిపీఠంలో తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న తొమ్మిది ప్రాంతాలలోని తొమ్మిది విగ్రహాలను తొలుత వైభవంగా ఊరేగించి కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు, భక్తులు, పాల్గొన్నారు.

నేడు వైకుంఠపురం ఆలయం మూసివేత



తెనాలి: వైకుంఠపురంలోని పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మూసివేయనున్నట్లు సహాయ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి వి.అనుపమ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు స్వామి, అమ్మవారలకు మహానివేదన, తదుపరి అవసర నివేదన సమర్పించిన అనంతరం ఆలయం మూసివేస్తామని తెలిపారు. తిరిగి సోమవారం ఉదయం దేవాలయంలో సంప్రోక్షణలు జరిపించి ఉదయం 10 గంటల నుంచి దర్శనం, పూజలు యథావిధిగా జరుగుతాయని వివరించారు.

వెబ్ పోర్టల్‌తో సమాచారం సులభం

అద్దంకిరూరల్: ఆర్టీఐ త్వరలో ప్రారంభించనున్న వెబ్ పోర్టల్‌తో వివిధ శాఖల సమాచారాన్ని సులువుగా పొందవచ్చని రాష్ట్ర ఆర్టీఐ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ ఆర్. మహబూబ్ బాషా తెలిపారు. శనివారం అద్దంకి వచ్చిన ఆయన స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖ కార్యాలయాల్లో రూ.10 స్టాంపుతో లెటర్ ద్వారా మనకి కావాల్సిన సమాచారాన్ని 30 రోజుల్లో తీసుకోవవచ్చన్నారు.

ప్రయాణానికి ఇన్ని చింతలా!

- అర్ధంతరంగా ఆగిన పులిచింతల రోడ్డు
- గత ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులు
- మిగులు జలాలతో మునిగిపోతున్న లో లెవెల్ చప్టా



చప్టా దాటేందుకు అవస్థలు పడుతున్న జడపల్లితండా యువకులు (ఫైల్)

అచ్చంపేట: పల్నాడు జిల్లా మాదిపాడు పంచాయతీలో గిరిజన తండాలైన జడపల్లిమోటు తండా, కంచుబోడు తండాలు చిట్టచివరి గ్రామాలు. ఈ గ్రామాల మీదుగా పులిచింతల ప్రాజెక్టుకు వెళ్లాల్సి ఉంటుంది. ఇందుకు గాను సుమారు 6 కిలో మీటర్ల దూరం సిమెంట్ రోడ్డు ఉంది. ఈ రెండు తండాల మధ్యలో సుమారు 6 అడుగుల లోతులో పెద్ద లోలెవెల్ వాగు కూడా ఉంది. ప్రాజెక్టు వద్దకు వెళ్లాలంటే వాహనాలు సైతం ఈ వాగులో నుంచే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పులిచింతల ప్రాజెక్టు నుంచి 2.50 లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీరు వదిలారంటే ఈ వాగు నిండిపోయి తండా వాసులు జలదిగ్బంధంలో నిలిచిపోతారు. ఈ రెండు గ్రామాల ప్రజల రాకపోకలు స్తంభించిపోతాయి.

2023లోనే నిధులు మంజూరు..

ఇక్కడి పరిస్థితులను గమనించిన అప్పటి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాదిపాడు నుంచి జడపల్లితండా, కంచుబోడు తండాలను కలుపుతూ పులిచింతల సీసీ రోడ్డు వరకూ ఉన్న 6 కిలో మీటర్ల దూరంలో డబుల్ రోడ్డు వేసేందుకు.. లోలెవెల్ చప్టాను హైలెవెల్ చేసేందుకు రూ.3 కోట్లు నాబార్డు నిధులు 2023లో మంజూరు చేయించారు. వెంటనే పనులు ప్రారంభించేందుకు శిలాఫలకాన్ని కూడా ఆవిష్కరించారు. ఇంతలో ఎన్నికలు రావడంతో రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయాయి.

ఫారెస్ట్ అధికారుల అనుమతులు లేవంటూ..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్డు నిర్మాణ పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. మాదిపాడు నుంచి సుమారు 3 కిలో మీటర్ల దూరం వరకూ బీటీ రోడ్డు వేశారు. ఆ తరువాత ఫారెస్ట్ అధికారుల నుంచి అనుమతులు కావాలంటూ ఆటంకాలు ఏర్పడటంతో రోడ్డు పనులు పూర్తిగా ఆగిపోయాయి. లోలెవెల్ వాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులు అసలు ప్రారంభమే కాలేదు. 6 కిలో మీటర్ల దూరం ఉన్న రోడ్డు కేవలం 3 కిలో మీటర్లే నిర్మాణం జరిగింది. రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయి కూడా సుమారు 9 నెలలు కావస్తోంది. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఫారెస్ట్ అనుతులు తెచ్చుకుని నిర్మాణ పనులు కొనసాగించడంలో పూర్తిగా విఫలమైందని పలువురు ఆరోపిస్తున్నారు.



అధ్వానంగా పులిచింతల రోడ్డు

డబుల్ రోడ్డుకు అనుమతులు తప్పనిసరి..

గతంలో ఈ రోడ్డు సింగల్ రోడ్డుగా ఉండేది. ఇప్పుడు డబుల్ రోడ్డు చేస్తున్నారు. ఫారెస్ట్ శాఖకు సంబంధించిన ఉన్నతాధికారుల నుంచి అనుమతులు తెచ్చుకుంటే రోడ్డును కొనసాగించుకునే అవకాశాలుంటాయి. స్థానిక ఎమ్మెల్యే ఆ దిశగా ఉన్నతాధికారులతో సంప్రదింపులు చేస్తున్నారు. త్వరలో అనుమతులు వస్తాయి.

– వెంకట రమణ, ఫారెస్ట్ రేంజర్

కొరవడిన శాఖల మధ్య సమన్వయం..

మాదిపాడు నుంచి కంచుబోడు తండా వరకు 20 ఏళ్ల క్రితం సింగిల్ బీటీ రోడ్డు ఉండేది. కొన్ని రోజులు ఆర్టీసీ బస్సులు నడిపారు. ఆ తరువాత ప్రాజెక్టుకు వాహనాల రద్దీ ఎక్కువ కావడం వల్ల, వర్షాలకు రోడ్డు కొట్టుకుపోయింది. పాత రోడ్డునే తిరిగి నిర్మాణం చేస్తున్నామని.. మళ్లీ అనుమతులెందుకని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతుండగా, గతంలో ఉన్న రోడ్డు అయినా ఇప్పుడు డబుల్ రోడ్డు వేస్తునారు కాబట్టి మళ్లీ అనుమతులు కావాల్సిందేనని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. ఈ రెండు శాఖల మధ్య సమన్వయ లోపం వల్ల రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయి తండా వాసులు, అటు ప్రాజెక్టు వద్దకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు

- ఆన్‌లైన్ స్టాక్ ట్రేడింగ్ పేరుతో రూ. 64.50 లక్షలు కాజేత
- ముంబై కేంద్రంగా వ్యవహారం నడిపిన సైబర్ నేరగాళ్ల ముఠా
- ఐటీ యాక్ట్ కింద సత్తెనపల్లి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు



సత్తెనపల్లి: సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు రూ. 64.50 లక్షలు పోగొట్టుకున్నారు. సత్తెనపల్లి పట్టణం రఘురామ్‌నగర్‌కు చెందిన కట్టెబోయిన కోటేశ్వరరావు అచ్చంపేట మండలం కొండూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సెకండ్ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్నాడు. ఆన్‌లైన్ స్టాక్ ట్రేడింగ్‌లో అధిక లాభాలు వస్తాయని సైబర్ నేరగాళ్లు ఆశ చూపడంతో కోటేశ్వరరావు వారి వలలో చిక్కుకున్నాడు. మార్చి 10న వాట్సాప్ నుంచి వచ్చిన లింకును ఓపెన్ చేయటంతో ఎఫ్ 979 2025 ఫార్చ్యూన్ గేట్ అనే గ్రూపులో సభ్యుడిగా చేర్చినట్లు మెసేజ్ వచ్చింది.

అలాగే ఓ మొబైల్ యాప్‌ను స్టాక్ మార్కెట్ కోసం డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. జూలై నుంచి ఆగస్టు 29 వరకు విడతల వారీగా రూ.10 వేల నుంచి ఆరంభమై నగదు జమ చేశారు. తన భార్య ప్రభుత్వ ఉపాధ్యాయిని అయిన అనూష ఖాతా నుంచి, స్నేహితుడి భార్య ఖాతా నుంచి కూడా నగదు పంపారు. మొత్తం రూ. 64,50,199 బదిలీ చేశారు. నగదు పెట్టుబడి పెట్టడమే తప్ప ఒక్క పైసా కూడా లాభం రాలేదు. తాను చెల్లించిన నగదు రిఫండ్ చేయాలని కోరగా ఒక రూపాయి కూడా తిరిగి ఇవ్వలేదు. దీంతో అనుమానం వచ్చి చిరునామా పెట్టమని కోరగా ముంబైలో ఏంజెల్ వన్ స్టాక్ బ్రోకర్ కార్యాలయం అంటూ చిరునామా ఇచ్చారు. అక్కడికి వెళ్లిన తర్వాత అది నకిలీ స్టాక్ బ్రోకర్ సైబర్ నేరగాళ్ల ముఠాగా తేలింది. ముంబై నుంచి తొమ్మిది సెల్ ఫోన్ నెంబర్ల నుంచి సైబర్ నేరగాళ్లు వ్యవహారం నడిపి నగదు కాజేశారు. మోసపోయిన కోటేశ్వరరావు సత్తెనపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు సీఐ నరహరి నాగమల్లేశ్వరరావు తెలిపారు.

ఆర్టీసీ బస్సులు కండిషన్‌లో ఉండేలా చూడాలి

- ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అప్పలరాజు
- జిల్లాలోని ఆర్టీసీ బస్ డిపోల సందర్శన



సత్తెనపల్లి ఆర్టీసీ డిపోలో మాట్లాడుతున్న ఈడీ(ఓ) అప్పలరాజు

సత్తెనపల్లి: ఆర్టీసీ బస్సులు కండిషన్‌లో ఉండేటట్లు నిత్యం చూసుకోవాలని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఏ.అప్పలరాజు అన్నారు. మాచర్ల, పిడుగురాళ్ల, సత్తెనపల్లి ఆర్టీసీ డిపోలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్త్రీ శక్తి పథకాన్ని విజయవంతం చేసేందుకు ఉద్యోగులు కృషి చేయాలన్నారు. దీనిలో భాగంగా బస్సులు ఎప్పటికప్పుడు కండిషన్‌లో ఉంచుకుని మహిళలకు ఏ మాత్రం ఇబ్బంది కలగకుండా ప్రయాణాలు జరిగే విధంగా బస్సులను అందుబాటులో ఉంచాలన్నారు. ఆయనతో పాటు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నెల్లూరు జోన్ జి.నాగేంద్రప్రసాద్, డీపీటీఓ టి.అజిత కుమారి, సత్తెనపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ జీఎస్‌వివి కుమార్, సిబ్బంది ఉన్నారు.

సూర్యఘర్ ఇనస్టలేషన్ పూర్తిచేయండి

- బ్యాంకులు 'సూర్యఘర్' రుణాలు మంజూరు చేయాలి
- ఎంపీ లావు, కలెక్టర్ అరుణ్‌బాబు




కలెక్టరేట్‌లో పథకంపై సమీక్ష చేస్తున్న ఎంపీ, కలెక్టర్, అధికారులు

నరసరావుపేట: జిల్లాలో పీఎం సూర్యఘర్ ద్వారా నమోదు చేసుకున్న 90 వేలు కుటుంబాలకు నెలరోజుల్లోగా సొర ప్యానెళ్లు ఇన్‌స్టాల్ చేయాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు విద్యుత్ శాఖ అధికారులను సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న ఇళ్లకు వెండార్ల ఎంపిక వెంటనే పూర్తిచేయాలన్నారు. గ్రామానికి వంద కుటుంబాలు లక్ష్యం చేసుకుని, ఒక్కో గ్రామాన్ని ఒక్కో వెండర్‌కు అప్పగించడం ద్వారా పనులు పూర్తిచేయాలన్నారు. శనివారం కలెక్టరేట్‌లో పీఎం సూర్యఘర్ పథకంపై విద్యుత్ శాఖ అధికారులు – వెండర్స్‌తో ఎంపీ, కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ సూర్యఘర్ పథకానికి బ్యాంకు రుణం కోరే ప్రజలకు సిబిల్ స్కోరుతో సంబంధం లేకుండా రుణాలివ్వాలన్నారు. సరైన రిజిస్ట్రేషన్లు లేని ఇళ్లకు ఇంటి పన్ను రసీదు ఆధారంగా రుణం మంజూరు చేయాలన్నారు. డీసీఆర్‌బీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, విద్యుత్ శాఖ అధికారి డాక్టర్. కె.విజయకుమార్, వెండార్లు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బీచ్ ఫెస్టివల్‌కు అందరు సహకరించాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సూర్యలంక బీచ్‌లో బీచ్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీక్షణ సమావేశ మందిరంలో శనివారం రియల్ ఎస్టేట్, బంగారు నగల వ్యాపారులు, బీచ్ రిసార్ట్ యాజమాన్యం, రైస్ మిల్లర్స్, పెట్రోల్ బంక్, ఎరువులు, విత్తనాల వ్యాపార సంఘ సభ్యులతో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 26, 27, 28 తేదీలలో సూర్యలంక, రామాపురం బీచ్‌లలో ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.4 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ప్రజలు కుటుంబ సమేతంగా వచ్చి కార్యక్రమాలు తిలకించే విధంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. తమ వంతు ఆర్థిక సహకారం అందజేయాలని కలెక్టర్ సంస్థల సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మరాజు, ఎం.ఎం.కొండయ్య, ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్ జి. గంగాధర్ గౌడ్, జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగిరెడ్డి పాల్గొన్నారు.

'అన్నదాత పోరు' జయప్రదం చేయండి

- ఇప్పుడు అన్నదాత పడుతున్న కష్టాలు గతంలో చూడలేదు
- క్రాప్ ఇన్స్యూరెన్స్ చేయలేదు, నష్టపరిహారం ఇవ్వట్లేదు
- రైతులకు పట్టించుకోని దుర్మార్గమైన కూటమి ప్రభుత్వం
- పోస్టర్ ఆవిష్కరంలో డాక్టర్ గోపిరెడ్డి, మురళీధర్‌రెడ్డి



అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి, మురళీధర్‌రెడ్డి తదితరులు

నరసరావుపేట: రాష్ట్రంలో అన్నదాత పడుతున్న కష్టాలను ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చేందుకు ఈనెల 9వ తేదీ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే అన్నదాత పోరులో కుల, మతాలు, పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం జిల్లా పార్టీ కార్యాలయంలో అన్నదాత పోరుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను పలువురు పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతులు యూరియా అందక ఇబ్బందులు పడుతున్నారని, వారికి 36వేల టన్నుల యూరియా ఇచ్చామని అధికారులు చెబుతున్నా ఎవరికి ఇచ్చారో లెక్కలు లేవన్నారు. యూరియా బ్లాక్‌లో ఇతర రాష్ట్రాలకు తరలిపోతుందని, కలెక్టర్, ఎస్పీలు చెక్‌పోస్టులు తనిఖీచేస్తున్నా ఫలితం కన్పించట్లేదన్నారు. సొసైటీల ద్వారా ఇస్తున్న వందల బస్తాలు ఎవరికి వెళుతున్నాయో లెక్కలు లేవన్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా అన్నీ అందజేశారని, టీడీపీ వారికే ఎక్కువ న్యాయం జరిగిందన్నారు. క్రాప్ ఇన్స్యూరెన్స్ గత ప్రభుత్వంలో రూ.1800 కోట్లు కట్టి రైతులకు ధైర్యం కలిగించగా కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు ఇన్స్యూరెన్స్ చేయలేదని చెప్పారు. మంత్రి లోకేష్‌కు చెందిన మంగళగిరి నియోజకవర్గంలో 70వేల ఎకరాల్లో పంట నష్టపోతే ఇప్పటివరకు ఎక్కడా ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదని చెప్పారు. రైతులకు సాగుకు అవసరమైన టార్పాలిన్ పంటలు, ట్రాక్టర్లు, తైవాన్ స్ప్రేయర్లు వెంటనే అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కూటమి పాలనలో రైతులకు కష్టాలు

పార్టీ రాష్ట్ర కార్యదర్శి యెనుముల మురళీధరరెడ్డి మాట్లాడుతూ రైతు పక్షపాత ప్రభుత్వం పోయి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు కష్టాలు మొదలయ్యాయన్నారు. ఈ ప్రభుత్వంలో ధాన్యం ధర రూ.1300లకు మించలేదని, గత ప్రభుత్వంలో రూ.2300 లభించాయని అన్నారు. మిర్చికి ధర లేకపోవటం వలన ఒక్క గురజాల నియోజకవర్గంలోనే రైతులు, కోల్డ్‌స్టోరేజ్ వ్యాపారులు, డీలర్లు, ఫర్టిలైజర్ వ్యాపారులు సుమారుగా రూ.200 కోట్లు నష్టపోతున్నారని పేర్కొన్నారు. యూరియా అందజేయటంలో కూడా ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతు భరోసా కేంద్ర ప్రభుత్వంలో సంబంధం లేకుండా రూ.20వేలు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు రూ.5వేలు మాత్రమే ఇచ్చి పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకోవటం విడ్డూరంగా ఉందన్నారు. అన్నదాత పోరులో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షులు కొమ్ము చంద్రశేఖర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, సత్తెనపల్లి నియోజకవర్గ పరిశీలకులు పడాల సాంబశివారెడ్డి మాట్లాడారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎస్.సుజాతాపాల్, డాక్టర్ల విభాగ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రైతు విభాగం, విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షులు అన్నెంపున్నారెడ్డి, గుజ్జర్లపూడి ఆకాష్, జిల్లా కోశాధికారి అన్నా మోహన్, రొంపిచర్ల మండల కన్వీనర్ కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, నరసరావుపేట పట్టణ అధ్యక్షులు షేక్ కరిముల్లా తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే తురకపాలెం ఘటన

- గ్రామంలో బెల్ట్ దుకాణాల ద్వారా ఏరులై పారుతున్న మద్యం
- అత్యంత అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ
- కలుషిత తాగునీటితో ప్రజలకు ఆరోగ్య సమస్యలు
- బాధిత కుటుంబాలకు అండగా వైఎస్సార్ సీపీ



బాధితులతో మాట్లాడుతున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని

గుంటూరురూరల్:తురకపాలెం గ్రామంలో పలువురు కేవలం కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే మృతి చెందారని వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ ఆరోపించారు. శనివారం గ్రామంలో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతులకు నివాళులర్పించారు. ప్రతి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని, న్యాయం జరిగే వరకూ పోరాడదామని భరోసా కల్పించారు. బలసాని మాట్లాడుతూ గ్రామంలో తాగునీరు ప్రజలకు అందటం లేదన్నారు. కానీ మద్యం మాత్రం ఏరులై పారుతోందన్నారు. చిన్నపాటి గ్రామంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నాలుగు బెల్ట్ షాపులు వెలిశాయని పేర్కొన్నారు. ఇంటి దగ్గరే మద్యం దొరుకుతుండటంతో అందరూ వాటికి అలవాటు అవుతారన్నారు.

మెరుగైన వైద్యసేవలు కీలకం

కలుషిత తాగునీరు, పారిశుద్ధ్యం లోపం, అక్రమ మద్యం విక్రయ దుకాణాలు వంటి వాటి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పంచాయతీ అధికారులు దీనికి బాధ్యత వహించాలన్నారు. స్పెషలిస్ట్ వైద్యులతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఇంటిని మినరల్ వాటర్‌ను అందించాలన్నారు. మృతి చెందిన ప్రతి కుటుంబానికి వెంటనే ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని పేర్కొన్నారు. ప్రతి రోజు పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి, మండల కన్వీనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, పిల్లి మేరి, పెద్దిరెడ్డి సామ్రాజ్యం, మెట్టు వెంకటప్పారెడ్డి, దారం అశోక్‌కుమార్, వెంకటరావు పాల్గొన్నారు.

చీరాల వాసికి అరుదైన అవకాశం

ఢిల్లీ ఎన్‌సీసీ క్యాంపునకు నేతృత్వం వహించనున్న రాజేష్‌బాబు



ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ అందిస్తున్న ఏఎన్‌ఓ రాజేష్‌బాబు

చీరాలటౌన్: దేశ రాజధాని ఢిల్లీలో ఈనెల 12 వరకు జరగనున్న ఆల్ ఇండియా తల్ సైనిక్ క్యాంపునకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్‌లకు ఏఎన్ఓ మేడికొండ రాజేష్‌బాబు నాయకత్వం వహించనున్నారు. ఈయన చీరాల వాసి కావడంతో ఎన్‌సీసీ క్యాడెట్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 23 ఆంధ్రా బెటాలియన్‌కు చెందిన అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న లెఫ్టినెంట్ మేడికొండ రాజేష్‌బాబు చీరాల ప్రసాద్‌నగర్ నివాసి. ఎంబీఏ అసిస్టెంట్ ప్రొఫెసర్‌తోపాటు ఏఎన్‌వోగా నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న రాజేష్‌బాబు ఆల్ ఇండియా తల్ సైనిక్ క్యాంపులో ఏపీ, టీజీ రాష్ట్రాల డైరెక్టరేట్‌ల తరఫున కాంటిజెంట్ కమాండర్‌గా ఎంపిక చేశారు. చీరాల వీఆర్ఎస్ అండ్‌వైఆర్ఎన్ కళాశాలలో ఎన్‌సీసీలో శిక్షణ పొంది పలు క్యాంపుల్లో పాల్గొనడంతోపాటు ఎన్‌సీసీ అధికారిగా, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూనే ఉన్నారు. ఈనెల 12 వరకు న్యూఢిల్లీలో జరిగే ఏబీటీయూసీ క్యాంపునకు దేశంలోని 17 డైరెక్టరేట్‌లు పాల్గొననున్నాయి. జాతీయ వేదికపై రెండు రాష్ట్రాలకు కాంటిజెంట్ కమాండర్‌గా ఎంపిక చేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

అవసరం మేరకే ఎరువులు కొనుగోలు చేయాలి

వ్యవసాయ సహాయ సంచాలకులు బి.రవిబాబు



ముప్పాళ్ల: రైతులు సాగు అవసరం మేరకే ఎరువులు కొనుగోలు చేయాలని వ్యవసాయశాఖ సత్తెనపల్లి ఏడీఏ బీ.రవిబాబు చెప్పారు. మండల కేంద్రమైన ముప్పాళ్లలోని జీడీసీఎంఎస్ కేంద్రం వద్ద ఎరువుల పంపిణీని మండలస్థాయి అధికారులతో కలిసి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ కేంద్రానికి ఎరువులు వచ్చాయని తెలియటంతో అన్ని గ్రామాల రైతులు ఒకేసారి గుమికూడటం, అక్కడ తగినంత స్థలం లేకపోవడం వలన రైతులందరూ ప్రధాన రహదారి పక్కన నిలబడటం జరిగిందన్నారు. 440 బస్తాలను ఒక్కో రైతుకు రెండు చొప్పున 220 మందికి పంపిణీ చేయటం జరిగిందన్నారు. ఇప్పటి వరకు జీడీసీఎంఎస్ ముప్పాళ్ల ద్వారా 171 మెట్రిక్ టన్నులు యూరియా, ఎరువులు రైతులకు అందించటం జరిగిందని, రైతులు ఎరువుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సరిపడా సరఫరా జరుగుతుందన్నారు. కేంద్రం వద్ద రైతులు వేచి ఉండేందుకు నీడకోసం షామియానా, కూర్చునేందుకు కుర్చీలు, తాగునీరు సౌకర్యం కల్పించాలని జీడీసీఎంఎస్ సిబ్బందిని ఆదేశించారు. తహసీల్దార్ కె.నగేష్, ఏఓ ఎస్.శ్రీధర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

పాముకాటుకు మహిళా కూలీ మృతి

బెల్లంకొండ: పాము కాటుకు మహిళా కూలీ మృతిచెందిన ఘటన బెల్లంకొండ మండలంలోని చంద్రాజుపాలెంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన లలిత(45) కూలి పనులకోసం రోజూలాగానే శనివారం పొలానికి కూడా వెళ్లింది. పనులలో నిమగ్నమైన సమయంలో పాము కాటేసింది. వెంటనే స్థానికులు ఆమెను చంద్రాజుపాలెం వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స చేసి సత్తెనపల్లి పంపారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

మాచర్ల దోపిడీ కేసు ఛేదన

- మంగళగిరి, గుంటూరుకు చెందిన తొమ్మిది మంది నిందితులు అరెస్ట్
- రూ.5లక్షల నగదు, రెండు కార్లు, మూడు కత్తులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు



మీడియాతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు, చిత్రంలో గురజాల డీఎస్పీ జగదీష్

నరసరావుపేట రూరల్: మాచర్లలో జరిగిన దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో తొమ్మిది మంది నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.5లక్షల నగదుతో పాటు రెండు కార్లు, మూడు కత్తులను స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు గురజాల డీఎస్పీ బీఎల్ఎన్ జగదీష్‌తో కలిసి మీడియాకు తెలియజేశారు. మాచర్లలో ఈనెల ఒకటో తేదీన దోపిడీ జరిగింది. కారులో వచ్చిన దుండగులు మంగళగిరికి చెందిన అవ్వారు మహేష్‌బాబును కత్తులతో బెదిరించి రూ.5లక్షలు ఎత్తుకెళ్లారు. దీనిపై బాధితుడు మాచర్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. డీఎస్పీ జగదీష్ ఆధ్వర్యంలో సీఐ పి.ప్రభాకరరావు, ఎస్ఐ వెంకట్రావులు తమ సిబ్బందితో దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో పాటు ఘటనా స్థలంలోని భౌతిక ఆధారాలు పరిశీలించి నిందితులను గుర్తించారు.

తొమ్మిది మంది అరెస్ట్..

దోపిడీ కేసులో మంగళగిరి, గుంటూరుకు చెందిన తొమ్మిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల్లో మహిళ కూడా ఉంది. మంగళగిరి దీన్‌దయాల్‌నగర్‌కు చెందిన కర్నె రాము ప్రధాన నిందితుడు కాగా గుంటూరుకు చెందిన ఫణీంద్రపు మహిమ క్రాంతి, మోదుకూరి ప్రసన్నబాబు, వల్లూరి శ్రీరామ్, ఫణిధరపు రాధిక, ఎటుకులపాటి నాగరాజు, సాగిరి వెంకట శివరామకృష్ణ, కొల్లిమర్ల లక్ష్మీబాబు, అందరేకుల లీలా నాగ లోకేష్‌లు అరెస్టయిన వారిలో ఉన్నారు. వీరిపై గుంటూరు జిల్లాలో పలు కేసులు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. నిందితులను అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.

పథకం ప్రకారం దోపిడీ..

మంగళగిరిలోని లక్ష్మీ శ్రీనివాస ట్రేడర్స్ కంపెనీ బ్యాంకులో తాకట్టులో ఉన్న బంగారు వస్తువులను కొనుగోలు చేస్తుంటుంది. ఈ కంపెనీలో ప్రధాన నిందితుడు కర్నె రాము గుమస్తాగా పనిచేస్తున్నాడు. మిగిలిన నిందితులతో రాము ముఠాగా ఏర్పడి దోపిడీకి పథకం రచించాడు. మాచర్లలో ముత్తూట్ ఫైనాన్స్‌లో 62 గ్రాముల బంగారం ఉందని దీనిని విడిపించాలని లక్ష్మీశ్రీనివాస ట్రేడర్స్ యజమానికి గత నెల 31వ తేదీన నిందితురాలు ఫణిధరపు రాధిక చేత ఫోన్ చేయించాడు. దీంతో మాచర్ల వెళ్లి నగదు చెల్లించి బంగారాన్ని విడిపించుకురావాలని ఉద్యోగియైన అవ్వారు మహేష్‌బాబుకు యజమాని సూచించాడు. దీంతో రూ.5లక్షల నగదుతో ద్విచక్రవాహనంపై ఈనెల ఒకటో తేదీన మాచర్ల వెళ్లిన మహేష్‌బాబును నాగార్జునసాగర్ రోడ్డులోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపైకి రమ్మని నిందితులు చెప్పారు. అక్కడికి వెళ్లిన మహేష్‌బాబుపై నిందితులు తొమ్మిదిమంది దాడిచేసి గాయపరిచి నగదు బ్యాగ్‌తో పాటు సెల్‌ఫోన్‌తో పరారయ్యారు. కేసును ఐదు రోజుల్లో ఛేదించిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. డీఎస్పీ, సీఐ, ఎస్ఐతో పాటు హెడ్‌కానిస్టేబుళ్లు జి.శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వర్లు, టెక్నికల్ టీం సభ్యులకు రివార్డులు అందజేస్తామని తెలిపారు.

అసెంబ్లీ నియోజకవర్గాలకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శుల ఎంపిక

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాకు చెందిన నలుగురిని పార్టీ రాష్ట్ర కార్యదర్శులు (పార్లమెంటు)గా నియమించి వారికి అసెంబ్లీ నియోజకవర్గాలను కేటాయిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మాచర్ల, నరసరావుపేట నియోజకవర్గాలకు గుత్తికొండ అంజిరెడ్డి, వినుకొండ, పెదకూరపాడులకు యెనుముల మురళీధర్‌రెడ్డి, గురజాల, చిలకలూరిపేటలకు నూతలపాటి హనుమయ్య, సత్తెనపల్లికి పడాల శివారెడ్డి నియమితులయ్యారు. వీరు పార్టీ కేంద్ర కార్యాలయంలో సమన్వయం చేసుకుంటూ సంబంధిత రీజినల్ కో-ఆర్డినేటర్లు, పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులకు సహాయకారిగా వ్యవహరిస్తారు.

రేపు ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలు

రొంపిచర్ల : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 8న ఉమ్మడి గుంటూరు జిల్లా సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ జట్ల సెలక్షన్స్ జరుగుతాయని గుంటూరు జిల్లా సాఫ్ట్ బాల్ ప్రెసిడెంట్ ఇ.వంశీకృష్ణారెడ్డి, సెక్రటరీ పి.సామంత్ రెడ్డిలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో సబ్ జూనియర్ బాలుర, బాలికల విభాగంలో సెలక్షన్స్ జరుగుతాయన్నారు. ఈ సెలక్షన్స్‌లో పాల్గొనే బాలురు, బాలికలకు జనవరి 2011 కటాఫ్ తేదీగా పరిగణించటం జరుగుతుందన్నారు. ఈ తేదీ తర్వాత పుట్టిన వారు మాత్రమే అర్హులన్నారు. ఈ సెలక్షన్స్‌లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలు తమ వెంట తప్పనిసరిగా తీసుకుని రావాలన్నారు. పూర్తి వివరాలకు 9581888902, 7995151556 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన



మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

సత్తెనపల్లి: గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవ సమస్యకు కారణమవుతున్న వలంటీర్ విధులను బహిష్కరిస్తూ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బైఠాయించి శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం పట్టణ అధ్యక్షుడు చిలుక ప్రదీప్ మాట్లాడుతూ గతంలో వలంటీర్లను క్లస్టర్లుగా విభజించి వారి సేవలను ప్రజలకు అందించడం జరిగిందన్నారు. ప్రస్తుతం వలంటీర్ వ్యవస్థ లేనందున ఆ సేవలను సచివాలయ ఉద్యోగుల చేత చేయించటం సరైనది కాదన్నారు. వలంటీర్ల విధులను తామెందుకు నిర్వహించాలని, తక్షణమే ఆ సేవలను సచివాలయ ఉద్యోగులకు కేటాయించటం మానుకోవాలన్నారు. ఈ సందర్భంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం సెక్రటరీ గౌతమి, మహిళా పోలీసులు జిల్లా ప్రెసిడెంట్ దామర్ల నళిని, తిరుమల లక్ష్మి గౌరవ సలహాదారుడు జి. రవిరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ బూరే సైదా, జిల్లా అధ్యక్షుడు బి. కొండలరావు, సచివాలయాల ఉద్యోగులు ఉన్నారు.

వైఎస్ జగన్‌పై కూటమి కక్ష సాధింపు చర్యలు

- మద్యం అక్రమ కేసులో ముగ్గురు విడుదల హర్షణీయం
- వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): సుమారు 120 రోజుల నిర్బంధం, జ్యుడీషియల్ రిమాండ్ తర్వాత ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, గ్రూప్-1 అధికారి కృష్ణమోహన్‌రెడ్డి, ప్రముఖ సీఏ గోవిందప్పలకు విజయవాడ ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేయడం హర్షణీయమని వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. దుర్మార్గమైన కేసు ఇదని అన్నారు. లిక్కర్‌లో అసలు స్కాం చేసే అవకాశం లేకపోయినా కావాలని క్రియేట్ చేశారని ఆరోపించారు. సిట్ అధికారులు రాజకీయ కక్ష తీర్చేందుకు పనిచేస్తున్నట్లు స్పష్టంగా అర్థమవుతోందని చెప్పారు. రాబోయే రోజుల్లో చాలా విషయాలు బయటకు వస్తాయని తెలిపారు. వైఎస్ జగన్‌పై కక్ష సాధింపు చర్యలు చేపట్టాలనే దురుద్దేశపూర్వకంగా చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరించిందని ఆరోపించారు. వేధింపులకు గురిచేసిన టీడీపీ ప్రభుత్వం.. తర్వాత బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. గతంలో చంద్రబాబు అసెంబ్లీకి రాకుండా బావురుమంటూ రోదించి వెళ్లలేదా అని గుర్తు చేశారు.

రైతులకు మేలు చేసేలా జీఎస్టీలో మార్పుల్లేవు



మాట్లాడుతున్న ఆతుకూరి ఆంజనేయులు

నగరంపాలెం: రైతులకు మేలు చేసేలా జీఎస్టీలో మార్పుల్లేవని ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు అన్నారు. జిన్నాటవర్ కూడలిలోని ఐసీసీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ యువత, కార్మికులకు కూడా జీఎస్టీలో శ్లాబుల మార్పు ఉపయోగపడేలా లేదన్నారు. పెట్రోల్, డీజిల్‌పై జీఎస్టీ తగ్గించాలని అన్నారు. ఆటోలు, ఫెర్టిలైజర్‌పై కూడా ఇదే నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు. మహిళలకు సంబంధించి కాస్మొటిక్స్, దుస్తులు, నగలపై పన్నులు విధించరాదని పేర్కొన్నారు. కొన్ని చోట్ల రివర్స్ ట్యాక్స్‌లు విధిస్తున్నారని, అది సరైందికాదని చెప్పారు. ఒకట్రెండు రోజులుగా కిరాణా వస్తువుల దుకాణాల ఎదుట స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలనే బోర్డులు ఏర్పాటు మంచిదని అన్నారు. మిగతా వ్యాపారస్తులు కూడా ప్రయత్నించాలని చెప్పారు. భారీ మాల్స్‌కు అనుమతి ఇవ్వవద్దని అన్నారు. పట్టణాల్లో నెలకొల్పినా మున్సిపల్, పంచాయతీల పరిధిలో వద్దని కోరారు.

పింఛన్ కోసం వెళ్తుంటే ప్రాణమే పోయింది

చికిత్స పొందుతూ మృతి చెందిన ఒంటరి మహిళ



నరసరావుపేట టౌన్: పింఛన్ తీసుకునేందుకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు టూటౌన్ ఎస్ఐ లేఖ ప్రియాంక శనివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తెనపల్లి మండలం, దూళ్ళిపాళ్ల గ్రామానికి చెందిన ఉర్లగొంట కోటేశ్వరమ్మ (54) గత కొన్ని నెలలుగా నరసరావుపేట మండలం, లింగంగుంట్ల గ్రామంలో ఉంటుంది. ఈ నెల 1వ తేదీన ఒంటరి మహిళ పింఛన్ తీసుకునేందుకు తన సోదరుడి ద్విచక్ర వాహనంపై దూళ్ళిపాళ్ల గ్రామానికి బయలుదేరింది. నరసరావుపేట పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డు వినాయకుని ఆలయం వద్దకు వచ్చేసరికి వాహనం వెనుక కూర్చున్న ఆమె తూలి కింద పడింది. సంఘటనలో తలకు బలమైన గాయం తగిలింది. క్షతగాత్రురాలిని 108 సహాయంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు అట్యా - పాట్యా జిల్లా జట్టు ఎంపికలు

నకరికల్లు: స్థానిక వంగా వెంకటరెడ్డి జెడ్పీ హైస్కూల్‌లో అట్యా-పాట్యా పల్నాడు జిల్లా జట్టు సెలక్షన్స్ ఆదివారం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ పల్నాడు జిల్లా కార్యదర్శి ఉన్నం రోహిత్ జోయల్ శనివారం తెలిపారు. పురుషుల, మహిళల జట్ల ఎంపిక జరుగుతుందని జిల్లాలోని అన్నిపాఠశాలల నుంచి సెలక్షన్లకు హాజరుకావచ్చన్నారు. క్రీడాకారులు ఈనెల 25, 26 తేదీలలో నకరికల్లులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు చింతా పుల్లయ్య, 9866925108, జి.రూనీస్ రాణి 99495 33234 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బ్యాంకర్లు ఉదారంగా వ్యవహరించాలి

గుంటూరు వెస్ట్: రైతులతోపాటు ఇతర రుణాలు ఇచ్చే క్రమంలో బ్యాంకర్లు కొంత ఉదారతతో వ్యవహరించాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, మొహమ్మద్ నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్ కుమార్‌లతో సమావేశమయ్యారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సీసీఆర్సీ కార్డులు అందుకున్న రైతులకు బ్యాంకర్లు రుణాలు తప్పనిసరిగా మంజూరు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. అనంతరం రుణాల యాక్షన్ ప్లాన్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో డీఆర్వో షేక్ ఖాజావలి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి నాగేశ్వరరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రత్నం మహిపాల్ రెడ్డి, ఇండియన్ బ్యాంక్ డీజీఎం గౌరీ శంకర్, ఆర్బీ ఎల్డీఓ గిరిధర్, నాబార్డ్ డీడీఎం శరత్ బాబు పాల్గొన్నారు.

9న జూనియర్ షూటింగ్ బాల్ జట్ల ఎంపిక

మేడికొండూరు : గుంటూరు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాల, బాలికల జట్ల ఎంపిక నిర్వహించనున్నారు. ఈ నెల 9వ తేదీన మేడికొండూరు మండలం కొరప్రాడులోని క్రీడా ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభం అవుతాయని అసోసియేషన్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి అనిల్ తెలిపారు.

ఆటో కార్మికులను రోడ్డున పడేశారు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

అమరావతిలో ఆటో కార్మికుల నిరసన ర్యాలీ

అమరావతి: స్త్రీ శక్తి పథకం ద్వారా కూటమి ప్రభుత్వం ఆటో కార్మికుల పొట్టకొట్టిందని సీఐటీయూ మండల కార్యదర్శి బి.సూరిబాబు అన్నారు. శనివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు మండల ఆటో కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులనుద్దేశించి సూరిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వలన లక్షలాది మంది ఆటో కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. ఉన్నతమైన చదువులు చదువుకున్న యువత ఉద్యోగాలు లేక బ్యాంకులు ద్వారా ఫైనాన్స్‌ల ద్వారా ఆటోలు తీసుకొని వారి కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. నేడు పిల్లలు ఫీజులు కట్టలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల్లో ఆటో కార్మికులకు రూ. 15వేలు ఇస్తామని హామీ ఇచ్చిన నేతలు 13 నెలలుగా పూర్తయినా, ఆర్థికసాయం గురించి, ఒక్క మాటైనా మాట్లాడడం లేదన్నారు. మరోపక్క డీజిల్, పెట్రోలు ధరలు పెరిగి, నిత్యావసర వస్తువులు ధరలు కొనుగోలు చేయలేని దుస్థితిలో కార్మికులు బతుకు లీడుస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంవత్సరానికి ప్రతి కార్మికుడికి రూ.25 వేలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ సత్తెనపల్లి నియోజకవర్గ నాయకుడు మస్తాన్ మాట్లాడుతూ ఆటో కార్మికులకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని ఎన్నికల్లో వాగ్దానాలన్ని కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు అనంతరం తహసీల్దార్ దానియేలుకు వినతిపత్రం అందజేశారు. టాటా మ్యాజిక్ యూనియన్ నాయకుడు షేక్ బుడేతో పాటుగా కోటి రవి, కోటి లింగం, నందిగం సుధాకర్, అడపాల కోటేశ్వరరావు అద్దంకి గోపి, షేక్ ఫరీద్ ప్రసాదు, వేదాంతం, సీపీఎం నాయకులు నండూరి వెంకటేశ్వరరాజు ఎస్టీ మొహీద్దీన్ వలి తదితరులు పాల్గొన్నారు.

మహిళపై గుర్తు తెలియని వ్యక్తులు బ్లేడుతో దాడి

సత్తెనపల్లి: మహిళపై గుర్తు తెలియని ఇరువురు వ్యక్తులు బ్లేడుతో దాడి చేసిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని అచ్చంపేటరోడ్‌లో సాయికృష్ణ థియేటర్ ఎదుట నివసిస్తున్న జిల్లెళ్లమూడి భవాని పట్టణంలోని నందిగామ డొంకరోడ్డులో గల సాధన అనాథ ఆశ్రమంలో డొనేషన్ ఇచ్చేందుకు వెళుతుండగా గుర్తు తెలియని ఇరువురు వ్యక్తులు వెనుకగా ద్విచక్ర వాహనంపై వచ్చి బ్లేడుతో భుజాలపై, కర్రతో నుదిటిన, కాలిపై దాడి చేశారు. దీంతో భవాని భుజాలపై, నుదుటిపై, కాలికి గాయాలయ్యాయి. హుటాహుటిన ఆమెను చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. సత్తెనపల్లి పట్టణ పోలీసులు వైద్యశాలకు చేరుకొని ఆమెనుంచి వివరాలు సేకరించారు. అంతేకాక డీఎస్పీ హనుమంతురావుకు సైతం ఆమె ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

తురకపాలెం మరణాలు ప్రభుత్వ హత్యలే



విలేకరుల సమావేశంలో ఆంధ్ర మాల్యాద్రి, సంఘ సభ్యులు

లక్ష్మీపురం: ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో ప్రజల మరణాలు ప్రభుత్వ హత్యలేనని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి ఆరోపించారు. గుంటూరు బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దళితులు ఎక్కువగా వారి కుటుంబ పోషకులను కోల్పోయారని తెలిపారు. ప్రజారోగ్య వ్యవస్థ ఎంత అధ్వానంగా ఉందనే విషయానికి ఈ ఘటన తార్కాణం అన్నారు. మృతుల కుటుంబంకు రూ.25 లక్షలు పరిహారంగా చెల్లించాలన్నారు. జిల్లా కార్యదర్శి జె.నవీన్ ప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షులు లూదర్ పాల్, జె.వెంకటస్వామి, సీఐటీయూ గుంటూరు నగర కార్యదర్శి ముత్యాలరావు, షేక్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

తురకపాలెం బాధితులకు రూ.10 లక్షలివ్వాలి

గుంటూరు రూరల్: తురకపాలెంలో ప్రభుత్వ వైఫల్యాలు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా దాదాపు 40 మందికిపైగా మరణించారని, బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రభుత్వం అందించాలని జనచైతన్య వేదిక, రేట్ పేయర్స్ అసోసియేషన్, అవగాహన, మానవత, నేస్తం, కొవిడ్ ఫైటర్స్, సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్, మాదిగ ఎడ్యుకేషన్ ట్రస్ట్ తదితర పౌర సంస్థల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. పౌర సంస్థల ప్రతినిధులతో కూడిన నిజ నిర్ధారణ కమిటీ శనివారం తురకపాలెం మృతుల కుటుంబాలను పరామర్శించింది.

అదుపులోకి పరిస్థితులు

గుంటూరు రూరల్: తురకపాలెం గ్రామంలో పరిస్థితులు పూర్తి స్థాయిలో అదుపులో ఉన్నాయని, ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నిరంతరం వైద్య ఆరోగ్య ఇతర సహాయక కార్యక్రమాలు కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు. శనివారం సాయంత్రం 6 గంటల వరకు 895 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మొత్తం 2,850 మందికి ఉపాహారం, 3500 మందికి మధ్యాహ్న భోజనం అందించామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ట్యాంకర్స్ ద్వారా రక్షిత మంచి నీటిని సరఫరా చేయడం జరుగుతోందన్నారు.